క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కాకినాడ రూరల్: స్థానిక ప్రతాప్‌నగర్ 33/11 కేవీ సెక్షన్ పరిధిలోని మధురానగర్ ఫీడర్‌పై శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఈఈ ఉదయ్ భాస్కర్ తెలియజేశారు. చెట్టు కొమ్మల తొలగింపు నిమిత్తం కమలేంద్రనాథ్ హాస్పటల్ ఏరియా, పాండురంగ టెంపుల్ ప్రాంతం, గోకులం స్కూల్ ఏరియాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని బుధవారం ఆయన కోరారు.

నడకుదురు ఫీడర్ పరిధిలో..

బోట్‌క్లబ్: నడకుదురు ఫీడర్‌పై చెట్టు కొమ్మలు తొలగించేందుకు శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.ఉదయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమ్మ ఘాటీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని నరసింహరోడ్, శివాలయంవీధి, తారకరామనగర్, ఘాటీసెంటర్, కొవ్వూరు రోడ్, కొవ్వూరు గ్రామం, తూరంగి, సుందర్‌నగర్, పప్పుల మిల్లు, రిక్షాలపేట, పరదేశమ్మపేట, ప్రసాదరావునగర్, సత్యదేవినగర్, ముగ్గుపేట, రెల్లిపేట, బాపూజీనగర్, పద్మనాభనగర్, మేకా నారాయ ణమ్మతోట, కాపులవీధి, మునసబ్ జంక్షన్ ఏరియాలలో ఉదయం 9 నుంచి 11 గంటలు వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

డీ4 సెక్షన్ పరిధిలో..

కాకినాడ రూరల్: కాకినాడ డీ4 సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ విద్యుత్ శాఖ ఈఈ ఎస్.ఉదయ భాస్కర్ తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ వర్క్‌లో భాగంగా లైన్ ఎబి స్విచ్ ఏర్పాటు చేసే నిమిత్తం 33/11కేవి సర్పవరం విద్యుత్ సబ్–స్టేషన్‌లోని 11 కేవీ ఫీడర్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియా, ఏపీఐఐసీ కాలనీ, పారిశ్రామిక ప్రాంతం, దండుపుంత ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మాదకద్రవ్యాల నిరోధంపై కళాజాత



మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన కల్పిస్తూ కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

కాకినాడ సిటీ: స్థానిక ఐటీఐ కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాలను నిరోధించాలని ప్రదర్శన నిర్వహించారు. వయోవృద్ధుల సంక్షేమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహాయ, సహకారాలు, పింఛన్లు, తల్లిదండ్రులను కన్నబిడ్డలు పట్టించుకోక పోతే ట్రిబ్యునల్ ద్వారా ప్రతినెల భరణంగా రూ.10 వేలు అందించేలా తీసుకువచ్చిన చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలా మొక్కలు పెంచాలి

కాకినాడ రూరల్: వృక్ష సంపద వల్లే భవిష్యత్తులో మానవాళి మనుగడ ఆధారపడి ఉన్నందున ఒక ఉద్యమంగా మొక్కలు నాటి పెంచాలని ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ కాకినాడ అధ్యక్షురాలు భానుమతి పేర్కొన్నారు. స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవనంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ కాకినాడ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా భానుమతి మాట్లాడుతూ భావితరాలకు ఆక్సిజన్ కొనే పరిస్థితి రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఇంటి ముందు మొక్క నాటాలని అన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ పుట్టినరోజున ఒక మొక్క నాటడాన్ని అలవరుచుకోవాలని భానుమతి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డి.లక్ష్మి, మల్లీశ్వరి, అనిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా అడ్డగర్ల

పెద్దాపురం: తంతి, తపాలా శాఖ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా పెద్దాపురం మండలం కాండ్రకోట బ్రాంచి పోస్ట్‌మాస్టర్ అడ్డగర్ల సురేంద్రనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజుల పాటు నంద్యాలలో జరిగిన రాష్ట్ర గ్రామీణ తపాలా ఉద్యోగుల మహాసభలో ఆయన ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర కమిటీకి ఎంపికైన సురేంద్రను పలువురు తపాలా ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

రైల్వే సరిహద్దుల్లో గడ్డికి వేలం

సామర్లకోట: రైల్వే శాఖ పరిధిలో సహజ సిద్ధంగా పెరిగిన గడ్డిని కోసుకెళ్లేందుకు ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందని పీడబ్ల్యూఐ కార్యాలయం సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రామ సుబ్బారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కడియం -కేశవరం, కేశవరం–ద్వారపూడి, ద్వారపూడి యార్డ్, అనపర్తి–బిక్కవోలు, బిక్కవోలు–పీబీ దేవం, పీబీ దేవం–జి.మేడపాడు, జి.మేడపాడు–సామర్లకోట స్టేషన్ల మధ్య ఉన్న రైల్వే సరిహద్దుల్లో గడ్డికి వేలం వేస్తున్నామన్నారు.

దేవ ఆదాయమే లక్ష్యంగా..

- ఆలయాలు, సత్రాల పరిధిలో భూముల లీజుకు చర్యలు
- వాటి నిర్వహణకు నిధులు సమకూరే అవకాశం
- ఆక్రమణలకు అడ్డుకట్ట



మల్లుకుట్ల అచ్చుతరామయ్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఖాళీస్థలం లీజు వేలం నిర్వహిస్తున్న దేవాదాయశాఖ అధికారులు (ఫైల్)

బోట్‌క్లబ్: సత్రాలు, ఆలయాల ఆదాయం పెంచేలా దేవాదాయశాఖ చర్యలు చేపట్టింది. వాటి పరిధిలోని ఖాళీ స్థలాలను 11 ఏళ్ల లీజు ప్రతిపాదికన ఇవ్వడం ద్వారా ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నది ఆ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకూ ఆయా ఖాళీ స్థలాలు నిరుపయోగంగానే ఉండేవి. వాటిని కబ్జా చేసేందుకు పలువురు ప్రయత్నించే వారు. వాటిని కాపాడుకొనేందుకు సంబంధింత ఈఓలు చాలా అవస్థలు పడేవారు. ఇకపై ఇటువంటి ఇబ్బందులు లేకుండా పోవడంతో పాటు ఆదాయం కూడా సమకూర్చేలా దేవాదాయశాఖ నిర్ణయం తీసుకుంది. నగరంలో స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయం ఎదురుగా ఉన్న సీతారామస్వామి ఆలయానికి సంబంధించిన ఖాళీ స్థలంలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు లీజు వేలం నిర్వహించగా రూ.80 వేల ఆదాయం వచ్చింది. ఇప్పటి వరకూ ఈ స్థలం ఖాళీగానే ఉండేది. స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయానికి వార్ఫు రోడ్డులో వెయ్యి గజాలు ఖాళీ స్థలం ఉంది. ఇది కూడా 11 ఏళ్ల లీజు వేలంకు ఇచ్చేందుకు దేవాదాయశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ స్థలం లీజుకు ఇచ్చే ఆయా ఆలయాలకు నెలకు రూ.2 లక్షలు వరకూ ఆదాయం వస్తుందని ఆ శాఖ అధికారులు అంచనాకు వచ్చారు. లీజు వేలం పూర్తయిన ఆదాయం పెరగడంతో భక్తులకు మెరుగైన సదుపాయాల కల్పనతో పాటు దేవస్థానం సిబ్బందికి జీతాల సమస్య తీరుతుంది. నగరంలో పైడా చలమయ్య శ్రీనివాస కల్యాణ మండపానికి చెందిన స్థలం స్థానిక రామారావుపేటలో ఉంది. ఇటీవల వేలం నిర్వహించగా సుమారు రూ.4 లక్షల ఆదాయం వచ్చింది. ముల్లుకుట్ల అచ్యుతరామయ్య ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కు ఉన్న ఖాళీస్థలంలో తాత్కాలిక షాపులు నిర్వహించేందుకు వేలం నిర్వహించగా రూ.రెండు లక్షల ఆదాయం వచ్చింది. ఇలా నగరంలో 8 పైగా ఆలయాలు, సత్రాలకు సంబంధించిన ఖాళీ స్థలాలు దేవాదాయశాఖ అధికారులు గుర్తించారు. వీటిని లీజుకు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

భూముల సద్వినియోగమే లక్ష్యం

నిరుపయోగంగా ఉన్న సత్రాలు, ఆలయాల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే నగరంలో ఉన్న అన్ని ఖాళీ స్థలాలను పరిశీలించాం. పేపరు ప్రకటన అనంతరం దశల వారీగా అన్నింటికి లీజు వేలం నిర్వహిస్తాం



కనపర్తి నాగేశ్వరరావు, జిల్లా దేవాదాయశాఖాధికారి

ప్రూటీకుమార్ సేవలు చిరస్మరణీయం



జీజీహెచ్‌లో అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రాగిరెడ్డి దీప్తికుమార్, నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న



ప్రూటీకుమార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

బోట్‌క్లబ్: వైఎస్సార్ సీపీ నగర మాజీ అధ్యక్షుడు దివంగత రాగిరెడ్డి వెంకట జయరాం కుమార్ (ప్రూటీకుమార్) జయంతి వేడుకలను కాకినాడలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దిగుమర్తివారివీధిలో వినాయకుడి ఆలయంలో పూజా కార్యక్రమాలు, అనంతరం కేక్ కట్ చేశారు. స్థానిక నాగమల్లితోట వద్ద ఉన్న జంతు హింసా నివారణ కేంద్రంలోని గోవులకు పశుగ్రాసం అందించారు. స్థానిక రెడ్‌క్రాస్ వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. స్థానిక మానవీయ వృద్ధుల ఆశ్రమంలో వస్త్రదానం, అన్నదానం చేశారు. కల్పనా సెంటర్‌లోని బులుసు సాంబమూర్తి వికలాంగుల పాఠశాల విద్యార్థులకు అన్నదానం చేశారు. స్థానిక జీజీహెచ్ వద్ద ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోగుల బంధువులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రాగిరెడ్డి దీప్తికుమార్, పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, రాగిరెడ్డి అరుణ్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆయన సేవలు మరువలేనివి మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి

బోట్‌క్లబ్: వైఎస్సార్ సీపీకి ప్రూటీకుమార్ సేవలు మరువలేనివని సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన జయంతి వేడుకలకు ద్వారంపూడి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రూటీకుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. 2019 ఎన్నికల్లో నియోజవర్గంలో విజయానికి ఆయన ఎంతో శ్రమించారన్నారు. అటువంటి మహానాయకుడు లేని లోటు తీరనిదన్నారు.

ఐవీఆర్ఎస్ కాల్స్‌కు సమాధానం ఇవ్వాలి

- డీఎల్‌డీఓ వాసుదేవరావు

కరప: వివిధ అంశాలపై గ్రామ పంచాయతీల పనితీరుపై ఐవీఆర్ఎస్ కాల్స్ అర్థం చేసుకుని సరైన సమాధానం ఇవ్వాలని డీఎల్‌డీఓ పి.వాసుదేవరావు అన్నారు. అడిగిన ప్రశ్న ఒకటైతే వేరేలా అర్థం చేసుకుని సొంత సమస్యగా భావించి సమాధానం ఇచ్చేటప్పుడు ఒక నంబరు నొక్కబోయి, మరో నంబర్ నొక్కితే ఆ పంచాయతీ పనితీరుపై తప్పుడు సమాచారం వెళ్తుందని, దానివల్ల పంచాయతీకి వచ్చే నిధులు వెనుకబడిపోతాయన్నారు. మండల పర్యటనలో భాగంగా బుధవారం ఆయన గురజనాపల్లిలో పర్యటించి పారిశుధ్య పనులు, తాగునీటి క్లోరినేషన్ పరిశీలించారు. చేయాల్సిన విధి, విధానాలపై సూచనలిచ్చారు. ఆయన ప్రజలను కలసి పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను విడదీసి ఇవ్వాలన్నారు. ఏమైనా సమస్యలున్నాయా అని ఆయన ప్రశ్నించగా, డ్రెయిన్లు లేక ఇళ్లల్లో వాడకంనీరు, వర్షనీరు వెళ్లే మార్గం లేక ఎక్కడ నీరు అక్కడే నిలబడిపోయి ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎక్కడెక్కడ డ్రెయిన్‌లు కావాలో ప్రతిపాదనలు పంపించాలని, నిధులను



గురజనాపల్లిలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న డీఎల్‌డీఓ వాసుదేవరావు

బట్టి మంజూరు చేయిద్దామని పంచాయతీ అధికారులను ఆయన ఆదేశించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి, దాని నిర్వహణపై సూచనలిచ్చారు. వాటర్ ట్యాంక్ క్లీనింగ్, క్లోరినేషన్ డీఎల్‌డీఓ వాసుదేవరావు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి సురేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నడకుదురులో..

నడకుదురు గ్రామంలో బుధవారం డీఎల్‌పీఓ టి.అన్నామణి పర్యటించి పారిశుధ్య పనుల నిర్వహణ, తాగునీటి క్లోరినేషన్, తడి, పొడి చెత్త సేకరణ, ఐవీఆర్ఎస్ కాల్స్ గురించి ప్రజలకు వివరించి, అవగాహన కల్పించారు. గ్రామ కార్యదర్శి వారిజ తదితర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు గొప్పలు.. నేడు తిప్పలు..

కాకినాడ రూరల్: తాము అధికారంలోకి వస్తే రహదారులు నిర్మిస్తామని, గతుకుల సమస్యలను పరిష్కరిస్తామని గొప్పలు పలికిన కూటమి పార్టీలు వాటిని పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రచార ఆర్భాటంగా గత సంక్రాంతికి ముందు రోడ్లుపై గతుకులు పూడ్చినప్పటికీ అవి మొక్కుబడి తంతులో జరగడంతో ఇప్పుడు పెద్దవిగా మారి ప్రమాదాలకు నిలయమవుతున్నాయి. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో సర్పవరం జంక్షన్ నుంచి మొదలుకొని రాయుడుపాలెం జంక్షన్ మీదుగా అచ్చంపేట జంక్షన్ వరకు పిఠాపురం ప్రధాన రహదారికి గతుకులు ఇబ్బందికరంగా మారాయి. గతంలో పూడ్చిన గోతుల్లోని కంకర, మట్టి పూర్తిగా తొలగిపోవడంతో గోతులు పెద్దగా కనిపిస్తున్నాయి. కాకినాడ నుంచి పిఠాపురం వైపు ప్రయాణించే ద్విచక్ర వాహన చోదకులు, కార్లపై వెళ్లే వారు గతుకులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణం గొతుకులు పూడ్చి, రహదారి నిర్మించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



కాకినాడ - పిఠాపురం రహదారిలో రాయుడుపాలెం జంక్షన్ సమీపంలో ప్రమాదభరితంగా ఉన్న గోతులు

స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలి

కరప: గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో పరిశుభ్రత పాటిస్తూ, సురక్షిత నీరందించాలని జలశక్తి మినిస్ట్రీ శాఖలోని స్వచ్ఛ సర్వేక్షన్ కేంద్ర బృందం సూచించింది. రీసెర్చ్ ఇన్వెస్టిగేషన్ బృంద సభ్యులు నేతి వీరభద్రరావు, పి.శ్రీనుబాబు, డీపీఆర్‌సీ అచ్చిరాజు తదితరులు వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం సాయంత్రం కరపలో పర్యటించారు. గ్రామ సచివాలయాన్ని, హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుధ్య పనుల నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర అంశాలను పరిశీలించి ఫీడ్‌బ్యాక్ నమోదుచేసుకుని వెళ్లారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి యు.నిర్మలాదేవి, హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆదిత్యలో కృత్రిమ మేధ వేడుకలు

బాలాజీచెరువు: ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోబోటిక్ ఆధ్వర్యంలో కృత్రిమ మేధ అభినందన దినోత్సవాన్ని కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు మాట్లాడుతూ ఈ సదస్సు టెక్ ఔత్సాహికులు, నైపుణ్యవంతులను ఒకచోట చేర్చి కృత్రిమ మేధస్సు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో పురోగతిని తెలుసుకోవడానికి దోహదపడుతుందన్నారు. ముఖ్య అతిథిగా వచ్చిన జేఎన్‌టీయూ మాజీ రిజిస్ట్రార్, సీఎస్ ప్రొఫెసర్ డాక్టర్ సుమలత మాట్లాడుతూ ఈ విధమైన సదస్సులు భావ వినిమయానికి ఉపయోగపడతాయని, ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులను అభినందించారు. ఏఐలో విద్యార్థులు పూర్తి నైపుణ్యాలను సాధించాలని తెలిపారు. క్విజ్, క్వాంటం కంప్యూటింగ్‌లో అత్యాధునిక పరిణామాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, ఏఐ టెక్నాలజీలో తాజా పోకడలు, ఆవిష్కరణలను ప్రదర్శించే పోస్టర్ ప్రెజెంటేషన్ వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిగ్రీ, పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్‌చార్జి మూర్తి, ఐటీ మేనేజర్ ఆర్ కార్తిక్, ఏఐ డీన్ సిద్ధార్థ రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి వీఎస్ఎన్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ సుమలత

దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

బోట్‌క్లబ్: మహిళలు దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోన్ అధ్యక్షురాలు మాకినీడి శేషుకుమారి అన్నారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ 144 జయంతిని బుధవారం ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ (ఏఐడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న మాకినీడి శేషుకుమారికి దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డును ఏఐడబ్ల్యూసీ సభ్యులు అందించి సత్కరించారు. భారత్ స్వాతంత్ర్యం కోసం ఆమె ఎంతగానో పోరాడారన్నారు. న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా ఆమె అందించిన సేవలు మరువలేనివన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఆమె ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారన్నారు. తొలుత దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఏఐడబ్ల్యూసీ సభ్యులు భానుశేషు, చక్క సుశీ, వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షురాలు ఎస్.సుజాత పాల్గొన్నారు.



శేషుకుమారికి దుర్గాబాయి దేశ్‌ముఖ్ పురస్కారం అందిస్తున్న ఏఐడబ్ల్యూసీ సభ్యులు

గొల్లమూడి చిరస్మరణీయుడు

- మాజీ ఎంపీ మిడియం బాబూరావు

కాకినాడ సిటీ: ఉపాధ్యాయునిగా పాఠాలు బోధిస్తూనే సైన్స్ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన గొల్లమూడి నాగేశ్వరరావు చిరస్మరణీయుడని మాజీ ఎంపీ మిడియం బాబూరావు కొనియాడారు. బుధవారం కాకినాడ సుందరయ్యభవన్‌లో ఈనెల 14వ తేదీన మరణించిన గొల్లమూడి నాగేశ్వరరావుకు సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ముందుగా సీపీఎం నాయకులు కరణం ప్రసాదరావు, మిడియం బాబూరావు, దువ్వా శేషుబాబ్జీ, జి.బేబీరాణి తదితరులు గొల్లమూడి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా యూటీఎఫ్ ఉద్యమంలో పని చేస్తూనే తన సేవలను మరింత విస్తృత పరచడానికి ప్రజా సైన్స్ ఉద్యమాన్ని ఎంచుకుని ఒక దశలో అవిశ్రాంతంగా పని చేశారని కొనియాడారు. విశ్రాంత జీవనంలో నగరపాలక సంస్థలో సీపీఎం కార్పొరేటర్‌గా ప్రజాసేవలో మన్ననలు పొందారన్నారు. సభలో సీపీఎం నాయకులు పలివెల వీరబాబు, కె.సత్తిరాజు, సీహెచ్ రాజ్‌కుమార్, మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లమూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

యోగాంధ్ర రాష్ట్రస్థాయి విజేతలకు అభినందన

కాకినాడ సిటీ: ఇటీవల విజయవాడలో నిర్వహించిన యోగాంధ్ర రాష్ట్ర స్థాయి ఉత్సవాల్లో జిల్లా విజేతలు, విశాఖలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో దేశప్రధాని నరేంద్ర మోదీతో కలిసి యోగాభ్యాసంలో పాల్గొన్న జిల్లాకు చెందిన విజేతలను బుధవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర మున్సిపల్ శాఖమంత్రి పి.నారాయణ, కలెక్టర్ షణ్మోహన్ అభినందించారు. ఆంధ్రప్రదేశ్ యోగ విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంఎస్ నాయకర్ జూనియర్ కళాశాల అధ్యాపకులు యోగాచార్య చిట్టూరి చిట్టిబాబులతో కూడిన బృందాన్ని వీరు ప్రత్యేకంగా అభినందించారు. మంత్రి నారాయణ చేతుల మీదుగా కలెక్టర్ షణ్మోహన్‌కు రాష్ట్ర యోగ పోటీ విజేతల అభినందన జ్ఞాపికను అందజేశారు. రాష్ట్ర యోగా పోటీల విజేతలు డి దుర్గాశాంతప్రసాద్ (ఫొటోగ్రఫీ), సయ్యద్ యాసిన్ మొహిద్దీన్ (వ్యాసరచన), ఎం.సత్తిబాబు (పోస్టర్ ప్రెజెంటేషన్), కె.ఆదిత్య (యోగా సాంగ్స్), కేబీపీ శివసాయిరామ్, జి.లహరి దుర్గ, ఆర్.చైత్ర శివ వాసుకి, జి దివ్యాంజలి, బి.లక్ష్మిలు (సోలో యోగ, మిక్స్ యోగ, సింక్రోనైజ్డ్ యోగ అంశాలు) తదితరులు వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న 12 మంది రాష్ట్ర విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర యోగా విజేతలను అభినందిస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం



మధ్యవర్తిత్వంపై నిర్వహించిన అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి ఆనంది

బోట్‌క్లబ్: మధ్యవర్తిత్వం ద్వారా కేసులను గౌరవప్రదంగా పరిష్కరించుకోవచ్చని జిల్లా మూడవ జడ్జి ఆనంది పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంఘం ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కార వారోత్సవాలలో భాగంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆమె ప్రారంభించారు. జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి జీజీహెచ్ వరకు ర్యాలీ నిర్వహించారు. చాలా మంది ఏళ్ల తరబడి న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇటువంటి వారు గౌరవప్రదంగా కేసులు పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం ఎంతో దోహదపడుతుందన్నారు. దీనికి సంబంధించి శిక్షణ పొందిన న్యాయవాదులు ఉన్నారని తెలిపారు. కుటుంబ కేసులు, ఆస్తి తగాదాలు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటారు వాహనాల కేసులు ఈ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జి భీరా శ్రీనివాస్, రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.వి జయబాబు, మూడో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.మోతీలాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు, కమిటీ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నర్సు, ఎఫ్ఎన్‌వో మధ్య వివాదం

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో ఒకే వార్డులో పనిచేస్తున్న ఓ నర్సు ఎఫ్ఎన్‌వోల మధ్య వివాదం చోటు చేసుకుంది. విధి నిర్వహణలో తనను వేధింపులకు గురిచేయడంతో పాటు వ్యక్తిగతంగా వేధిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తూ ఎఫ్ఎన్‌వో సామాజిక మాధ్యమంలో ఓ వీడియో విడుదల చేసింది. దీంతో అధికారులు స్పందించి ఎఫ్ఎన్‌వో ఫిర్యాదు ఆధారంగా వివాదాన్ని బుధవారం ఇంటర్నల్ కంప్‌లెంట్స్ (ఐసీసీ)కి సిఫార్సు చేశారు. విచారణ అనంతరం వాస్తవాల ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

రేపు శాకంబరిగా బాలా త్రిపురసుందరి

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శుక్రవారం శాకంబరిగా భక్తులను దర్శమివ్వనున్నారు. అమ్మవారిని వివిధ రకాలు కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించనున్నట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు బుధవారం విలేకర్లకు తెలిపారు. శాకంబరి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు. అమ్మవారి అలంకరణకు అవసరమైన కూరగాయలు, పండ్లు ఇచ్చే భక్తులు గురువారం సాయంత్రంలోగా ఇవ్వాలన్నారు.